సాక్షి
కామారెడ్డి

శనివారం । 19 । అక్టోబర్ । 2024



కొనుగోలు కేంద్రాల్లోనే..

కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యం విక్రయించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸



కెపాసిటర్లు బిగించుకోవాలి

వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /22.4

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'ధాన్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి'



నిజాంసాగర్(జుక్కల్): వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం తూకాల విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యం సేకరణ, బస్తాల తరలింపు విషయాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ నిరసన

కామారెడ్డి అర్బన్: దేవాలయాలపై నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఏ.నిత్యానందం, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్‌కుమార్ ఆరోపించారు. ఆలయాలపై దాడులకు నిరసనగా శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి, ఆలయాలపై దాడులు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు గుర్తింపు



కామారెడ్డి టౌన్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు రాష్ట్ర అసోసియేషన్ నుంచి గుర్తింపు లభించిందని సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కేటీఆర్, ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ అఫిలియేషన్ లెటర్‌ను జారీ చేశారన్నారు. ఈ గుర్తింపుతో కామారెడ్డిలో సైతం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించవచ్చన్నారు. అలాగే జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటే లభించే సర్టిఫికెట్‌ల ద్వారా క్రీడల కోటాలో ఉద్యోగాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. బ్యాడ్మింటన్‌పై ఆసక్తి ఉన్న పేద క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సందీప్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహిపాల్ జైన్, కార్యదర్శి సురేశ్, ప్రతినిధులు ముప్పారపు ఆనంద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా టీచర్ శిక్షణ తరగతులు

కామారెడ్డి అర్బన్: జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి యోగా టీచర్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. శనివారంనుంచి ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు శిక్షణకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, రాత్రి 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అందుబాటులో లేని వారికి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణ పొందినవారికి వచ్చేనెల 9న పరీక్ష నిర్వహిస్తామని, ఇతర వివరాలకు 94400 37948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి శుక్రవారం 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

నేర పరిశోధనలో ముందంజ!

- కేసుల ఛేదనలో సిబ్బందికి దిశానిర్దేశం
- సైబర్ క్రైమ్స్ నిరోధానికి చర్యలు
- చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీకి ప్రాధాన్యత
- జిల్లా ఎస్పీగా సింధుశర్మ బాధ్యతలు స్వీకరించి ఏడాది
- జిల్లా పోలీస్ శాఖపై తనదైన ముద్ర వేసిన ఎస్పీ



రాష్ట్రంలో మొదటి స్థానం..

చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో(కమిషనరేట్లు మినహా) రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లాలో ఇప్పటివరకు అత్యధికంగా 2,140 ఫోన్లు రికవరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక బృందం అదే పనిలో నిమగ్నమై ఉంటోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా పోలీస్ అధికారిగా ఐపీఎస్ అధికారి సింధుశర్మ బాధ్యతలు స్వీకరించి ఏడాది గడిచింది. ఆమె జిల్లా ఎస్పీగా గతేడాది అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి జిల్లా పోలీసు శాఖ పనితీరు మెరుగుపడేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సింధుశర్మ.. ఆ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. తర్వాత పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారన్న పేరు సంపాదించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ కేసుల నమోదుతోపాటు వాటిని ఛేదించడంలోనూ దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే సైబర్ నేరాల్లో నష్టపోయినవారికి బాసటగా నిలుస్తున్నారు. షీటీంలను మరింత పటిష్టం చేసి, ఆడపిల్లలు, మహిళలకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు.

కేసుల నమోదూ ఎక్కువే..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి 4,547 కేసులు నమోదయ్యాయి. గతేడాదికన్నా కేసుల సంఖ్య దాదాపు 30 శాతం పెరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. కేసులు నమోదు చేయడమే కాదు.. వాటిని పరిశీలించి డిస్పోజ్ చేయడమూ ముఖ్యమని పేర్కొంటారు ఎస్పీ సింధుశర్మ. పోలీసులు తమకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు చేస్తున్నారు. తరువాత విచారణ జరిపి అవసరమైన ఆధారాలు సేకరించి చార్జి షీట్లు దాఖలు చేస్తున్నారు. ఆయా కేసుల్లో చార్జి షీట్లు నమోదు చేసి డిస్పోజ్ చేశామని, ప్రస్తుతం 999 కేసులు విచారణలో ఉన్నాయన్నారు.

షీ టీంలు మరింత పటిష్టం

ఎస్పీ సింధుశర్మ జిల్లాలో షీ టీంలను మరింత పటిష్టం చేశారు. ఏడాది కాలంలో జిల్లావ్యాప్తంగా షీ టీంలకు 236 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో సాధారణ పిటిషన్లు 142, ఈవ్ టీజింగ్ పిటిషన్లు 94 ఉన్నాయి. పోలీసులు వీటిని పరిశీలించి 62 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మిగతా కేసుల్లో కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థినులు, మహిళల విషయంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై పోలీసు శాఖ జిల్లాలో 536 అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఆడపిల్లలు తమకు సమస్య ఎదురైనప్పుడు పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలన్న దానిపైనా అవగాహన కల్పిస్తున్నారు.

సైబర్ నేరాలపై ఫోకస్...

సైబర్ నేరాలపై జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగంతకులకు ఓటీపీలు చెప్పడం గానీ, వారు పంపించిన లింక్‌లను ఓపెన్ చేయడం కానీ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అయినప్పటికీ చాలా మంది మోసపోతూనే ఉన్నారు. జిల్లాలో సైబర్ క్రైంలకు సంబంధించి 859 ఫిర్యాదులు వచ్చాయి. రూ.2.93 కోట్ల మేర బాధితులు నష్టపోగా.. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసు శాఖ కేసులు నమోదు చేసుకుని సత్వరమే స్పందిస్తోంది. అనంతరం పోలీసుల ప్రయత్నాలతో రూ.46 లక్షలు రికవరీ చేయగలిగారు.

గ్రూప్స్ నిర్వహణకు సన్నద్ధం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అధికారులు

- టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష

కామారెడ్డి టౌన్: గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో మాట్లాడారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 17, 18 తేదీలలో గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీలలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలను శనివారం తనిఖీ చేసి, అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. పరీక్ష కేంద్రాల ధ్రువీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణను ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో ప్రశ్నపత్రాలు, ఇతర ముఖ్యమైన సామగ్రిని భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలకు 8,300 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికోసం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, గ్రూప్స్ రీజనల్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'అడ్మిషన్‌లను వేగవంతం చేయాలి'

కామారెడ్డి టౌన్: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లలో నూతన కోర్సుల్లో అడ్మిషన్‌లను వేగవంతం చేయాలని కార్మిక, ట్రైనింగ్ ఫ్యాక్టరీ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కార్మిక, ఎంప్లాయిమెంట్ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యతో కలిసి హైదరాబాద్‌నుంచి జిల్లాల కలెక్టర్లు, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లలో కొత్తగా ఆరు కోర్సులను ప్రారంభించిందన్నారు. ఆయా కోర్సుల్లో అడ్మిషన్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాల వారీగా అడ్మిషన్ల ప్రక్రియను ఆయన సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. ఆరు కోర్సులపై ప్రచారం చేయాలని, విద్యార్థులకు అవగాహన కల్పించి అడ్మిషన్లను పూర్తి చేయాలని ఐటీఐ ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఐటీఐ కన్వీనర్ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవద్దు

- విండోల పర్సన్ ఇన్‌చార్జీలకు న్యాయస్థానం ఆదేశం
- 21న కేసును విచారిస్తామన్న హైకోర్టు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బస్వాపూర్ విండోను విభజించి బస్వాపూర్, కాచాపూర్ విండోలుగా ఏర్పాటు చేసిన సహకార శాఖ అధికారులు ఆయా సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడంపై విండో వైస్ చైర్మన్, డైరెక్టర్లు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై శుక్రవారం కోర్టులో న్యాయమూర్తి ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత పర్సన్ ఇన్‌చార్జీలు ఎలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని ఆదేశించారు. ఈనెల 21న కేసు విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

బస్వాపూర్ విండోను ఇటీవల రెండుగా విభజించారు. కాచాపూర్ విండో పర్సన్ ఇన్‌చార్జీగా లింగాల కిష్టాగౌడ్‌ను, బస్వాపూర్ విండో పర్సన్ ఇన్‌చార్జీగా మల్లారెడ్డిని నియమిస్తూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సహకార చట్టం ప్రకారం గెజిట్ విడుదల కాకముందే పర్సన్ ఇన్‌చార్జీలను ఎలా నియమిస్తారంటూ విండో వైస్ చైర్మన్ మద్ది స్వామితో పాటు డైరెక్టర్లు రాంరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, నర్సింలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టులో వాదనలు జరిగాయి. ప్రస్తుతం నియమితులైన పర్సన్ ఇన్‌చార్జీలు సాధారణ కార్యకలాపాలు తప్ప, ఎలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవద్దంటూ కోర్టు ఆదేశించింది.

నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ బదిలీ

- బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శినికి సైతం స్థానచలనం
- కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిన భార్యాభర్తలు



సీపీ కల్మేశ్వర్




ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తోపాటు ఆయన సతీమణి డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని బదిలీ అయ్యారు. వారిని బదిలీ చేస్తూ శుక్రవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది అక్టోబర్ 13న శాసనసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు సీపీగా కల్మేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పూర్తి చేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీపీ కల్మేశ్వర్ అప్పటి ఐజీ రంగనాథ్, డీజీపీ రవిగుప్తాలను కలిసి బదిలీ చేయాలని కోరినట్లు తెలిసింది. అయితే జిల్లాలో సీపీ తీసుకొచ్చిన సంస్కరణలతో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉందని బదిలీ చేయలేమని వారు చెప్పినట్లు పోలీస్ వర్గాలలో చర్చ జరిగింది. సీపీ సతీమణి ఐపీఎస్ అధికారిణి రోహిణి ప్రియదర్శినిని హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లిలోని బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు. ఆమె సుమారు ఆరు నెలలపాటు పని చేశారు. తాజాగా వారిద్దరిని కేంద్ర సర్వీసులైన నేషనల్ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా బదిలీ చేశారు. వారు త్వరలోనే రిలీవ్ కానున్నట్లు తెలిసింది.

రబీసాగుకు రంది లేదు!

- నిండుకుండలా పోచారం ప్రాజెక్టు
- డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేయాలని కోరుతున్న రైతులు



పోచారం ప్రాజెక్టు నీటిమట్టం



ప్రాజెక్టు గేట్ల వద్ద ధ్వంసమైన ప్రధాన కాలువ

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో యాసంగి పంటలకు భరోసా లభించింది. ప్రాజెక్టుపై ఆధారపడి నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని రైతులు పంటలను సాగు చేస్తారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టును 'ఏ' జోన్, 'బీ' జోన్‌గా విభజించారు. వానాకాలంలో ప్రాజెక్టు నీటిని రెండు జోన్లకు అందిస్తారు. రబీ సీజన్‌లో మాత్రం ఒక ఏడాది 'ఏ' జోన్‌కు, మరో ఏడాది 'బీ' జోన్‌కు కేటాయిస్తారు. నిబంధనల ప్రకారం ఈ రబీ సీజన్‌లో ప్రాజెక్టు నీటిని 'ఏ' జోన్‌కు కేటాయించనున్నారు. కాగా ఈసారి వానాకాలం ప్రారంభంలో వర్షాలు సరిగ్గా కురియక ప్రాజెక్టులోకి చుక్కనీరు చేరక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. సెప్టెంబర్‌లో విస్తారంగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో వానాకాలం పంటలు గట్టెక్కాయి. వానాకాలం పంటల సాగు పూర్తయినప్పటికీ ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడుతుండడంతో ఆయకట్టు రైతులకు రబీ సాగుపై పూర్తి భరోసా వచ్చింది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.82 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అధ్వానంగా కాలువలు

పోచారం ప్రాజెక్టు వద్ద నుంచి ప్రారంభమయ్యే ప్రధాన కాలువ ఆయకట్టు పరిధిలో 58 కిలోమీటర్ల పొడవునా విస్తరించింది. ప్రధాన కాలువకు 78 డిస్ట్రిబ్యూటరీలుండగా వాటిలో 'ఏ' జోన్ పరిధిలో 1 నుంచి 44 డిస్ట్రిబ్యూటరీలు, 'బీ' జోన్‌లో 45 నుంచి 78 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. అయితే డిస్ట్రిబ్యూటరీలు చాలావరకు దెబ్బతిన్నాయి. డి-1, 5, 14, 33, 34 లు ధ్వంసమవడంతో సాగునీరు వృథాగా పోతోంది. దీంతోపాటు డి-10ఏ, 11, 13, 17, 18, 21 కాలువలు కూడా అధ్వానంగా ఉన్నాయి. డి-25 కి బుంగలు పడడంతో నీరు వృథా అవుతోంది. ఆయా కాలువలకు మరమ్మతులు చేపడితేనే ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది.

> **కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు**
>
> పోచారం ప్రధాన కాలువకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీల నుంచి నీరు లీకవుతున్న మాట వాస్తవమే. ధ్వంసమైన డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదు. రబీ సీజన్ ప్రారంభమయ్యేలోపు మరమ్మతులు చేయించడానికి కృషి చేస్తాం.
>
> – వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ, ఎల్లారెడ్డి

కొత్త వీసీకి అనేక సవాళ్లు

- 16 నెలలుగా తెలంగాణ వర్సిటీలో ఇన్‌చార్జి వీసీల పాలన
- అంతకుముందు రెండేళ్లపాటు వీసీ రవీందర్ హయాంలో అంతా అస్తవ్యస్తం
- గత పాలకమండలి తీర్మానాల అమలుకు దిక్కులేని వైనం
- అక్రమ నియామకాలు, అక్రమ పీహెచ్‌డీ ప్రవేశాలు..
- 2014 వివాదాస్పద నియామకాలపై పకడ్బందీగా వెళ్లకపోతే తప్పనితిప్పలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీకి ఎట్టకేలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించారు. 2023 జూన్ 17న అప్పటి వీసీగా ఉన్న రవీందర్‌గుప్తా ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినప్పటి నుంచి ఇన్‌చార్జిల పాలనే నడుస్తోంది. దీంతో అంతా గందరగోళంగా తయారైంది. కాగా రవీందర్ గుప్తా హయాంలో వర్సిటీ పరువు బజారుపాలైంది. 120 మందికి పైగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అక్రమ నియామకాలు, పీహెడీలకు సంబంధించి అక్రమంగా చేసిన ప్రవేశాలు, 2014 వివాదాస్పద నియామకాలకు సంబంధించి హైకోర్టులో ఉన్నప్పటికీ ఆయా ఫైళ్లను నిబంధనలకు విరుద్ధంగా మూవ్ చేయడంతో పాటు ఇతర పలురకాల అంశాలు వర్సిటీలో చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సైతం తలనొప్పిగా మారిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి అనేక అంశాలు కొత్తగా రానున్న వైస్ చాన్స్‌లర్ టి యాదగిరిరావుకు సవాళ్లుగా నిలవనున్నాయి. పైన చెప్పిన అంశాలతో పాటు అనేక కీలక అంశాలు, గత పాలకమండలి తీర్మానాలు సైతం అమలు చేయకపోగా అలాగే ఉన్నాయి. పరీక్షల విభాగంలో గందరగోళ పరిస్థితుల నుంచి మొదలు ఇలాంటి అనేక వ్యవహారాలను చక్కబెట్టాల్సిన బాధ్యత కొత్త వీసీపై పడనుంది.

■ గత వీసీతో పాటు ఇద్దరు ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు పాల్పడిన అవకతవకలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తోంది. ఒక రిజిస్ట్రార్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో సెల్ఫ్ చెక్కుల ద్వారా తీసుకున్న ఖర్చుల వివరాలు చూస్తే విస్తుపోవాల్సిందే. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పేరిట ఏకంగా రూ.11 లక్షలు డ్రా చేసుకోవడం విశేషం. మరోసారి ఏకంగా మొత్తం రూ.15.21 లక్షలు డ్రా చేసుకోవడం గమనార్హం. ఇంకా అనేకం వెలుగు చూస్తున్నాయి.

■ వీసీతో కలిసి అనేక అవకతవకలకు, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లను ఇద్దరినీ సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసినప్పటికీ ఇప్పటి వరకు చేయలేదు. ఎలాంటి అడ్డంకులు లేకున్నప్పటికీ ఈ తీర్మానాలు అమలు కాలేదు. పైగా ఎవరినైతే సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసిందో ఆ వ్యక్తినే అకడమిక్ ఆడిట్ సెల్ డైరక్టర్‌గా కొనసాగించారు. అదేవిధంగా విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం చేసిన గత ముగ్గురు రిజిస్ట్రార్ల నుంచి రికవరీ చేయాలని పాలకమండలి నిర్ణయించింది.

వైస్ చాన్స్‌లర్‌గా యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఐదో శాశ్వత వైస్ చాన్స్‌లర్‌గా యాదగిరిరావు నియామకమయ్యారు. ఈయన ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి ఈయన స్వగ్రామం. కేయూలో 1988లో పీజీ, 1992లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. యాదగిరిరావు కేయూ దూర విద్యాకేంద్రంలో తొలి ఉద్యోగి. 1996లో కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. 2005 లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2011 లో ప్రొఫెసర్‌గా పదోన్నతు లు పొందారు. ప్రస్తుతం 2021 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. బోధన, పరిశోధనా రంగంలో 33 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. కేయూలో అధ్యాపకుడిగా 28 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌డీ లో 21 మంది పరిశోధక విద్యార్థులకు, ఎంఫిల్‌లో 9 మందికి గైడ్‌గా వ్యవహరించారు. కాకతీయ యూనివర్సిటీ యూజీసీ కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా, బీవోఎస్ చైర్‌పర్సన్‌గా పలు అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులు నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ వీసీ సాంబయ్య హయాంలో యాదగిరిరావు తెయూ సోషల్ సైన్స్ డీన్‌గా రెండున్నరేళ్లపాటు పని చేశారు. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- దళారులకు అమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి


గృహ మంజూరు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, బోర్లం సహకార సంఘం అధ్యక్షుడు సంగ్రాంనాయక్‌లతో కలిసి బోర్లంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. 17 శాతం లోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. సొసైటీ కార్యదర్శి సురేందర్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, పర్వారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన 40 మంది డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు గృహమంజూరు ప్రొసీడింగ్(పట్టాలు)లను శుక్రవారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పంపిణీ చేశారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బాధ్యతతో పనిచేయాలి

బాన్సువాడ రూరల్: నూతనంగా ఎన్నికైన టీఎన్జీవోస్ కార్యవర్గం బాధ్యత, అంకితభావంతో పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన బాన్సువాడ తాలుకా టీఎన్జీవోస్ కార్యవర్గాన్ని ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజులు అభినందించారు. కామారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బాన్సువాడ తాలుకా నూతన అధ్యక్ష, కార్యదర్శులు తుల శ్రీనివాస్, అజీమొద్దీన్, కోశాధికారి అబ్దుల్ రజాఖ్, ఉపాధ్యక్షులు రవి, సుభాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్‌గా శంకరయ్య

ఎల్లారెడ్డి: అంబేడ్కర్ యూనివర్సిటీ ఎల్లారెడ్డి స్టడీ సెంటర్ కో- ఆర్డినేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకరయ్యను నియమిస్తూ యూనివర్సిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. కో-ఆర్డినేటర్‌గా నియమితులైన శంకరయ్య శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయనను సిబ్బంది శాలువాతో సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, అధ్యాపకులు, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలంలోని ఆర్గోండ, బస్వన్నపల్లి, కొండాపూర్, గుండారం గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేసినట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, పార్టీ ఉపాధ్యక్షులు శ్రీధర్, బస్సీలాల్, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగంపేట పరిధిలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ పంపిణీ చేశారు. 34 మంది లబ్ధిదారులకు రూ. 9.20 లక్షల విలువైన చెక్కులు అందజేసినట్లు తెలిపారు. నాయకులు ఎల్లమయ్య, మోహిద్, రవి, ప్రసాద్, రామాగౌడ్, రఫీక్, గులాం పాల్గొన్నారు.

తప్పనిసరిగా టీకాలు వేయించాలి

కామారెడ్డి రూరల్: పాడిపశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రవికిరణ్ సూచించారు. శుక్రవారం క్యాసంపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు టీకాలను వేశారు. పాల డైరీ అధ్యక్షుడు సందరి రాజిరెడ్డి, సందిరి నారాయణరెడ్డి, బాలకిషన్‌గౌడ్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

'102' సేవలను వినియోగించుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: '102' సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ అన్నారు. గర్భిణులు వైద్య పరీక్షల కోసం వారి గ్రామాల నుంచి తీసుకు రావడం, తీసుకెళ్లడంతో పాటు బాలింతలు ప్రసవించిన అనంతరం వారిని సైతం ఇంటి వద్ద దింపడానికి ప్రభుత్వం ఈ 102 సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో 102 సిబ్బంది మోహన్, సతీష్ తదితరులున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులు



కామారెడ్డి టౌన్: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపంగా విద్యార్థి, ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో నివాళులు అర్పించారు. నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జగన్నాథం, నర్సింహారెడ్డి, సిద్దిరాములు, చంద్రశేఖర్, రామరాజు, బాబు, ఆజాద్, అరుణ్, విఠల్, శంకర్, నర్సింలు, దాస్ తదితరులున్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



నిజాంసాగర్(జుక్కల్): ఇంటి పన్నులతో పాటు వృత్తి వ్యాపార పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి మతిన్ అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కుళాయి పన్నులతో పాటు ఇంటి పన్నులు చెల్లిస్తే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కారోబార్ గుండు అంబయ్య తదితరులున్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటాం



నిజాంసాగర్ (జుక్కల్): బోధన్ -హైదరాబాద్ రోడ్డు విస్తరణ పనుల్లో భవనాలు కోల్పోతున్న బాధితులకు తన వంతు న్యాయం జరిగేలా చూస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ బాధితులు ఆయనను కలిశారు. వారి సమస్యలు ఆయనకు వివరించారు. విస్తరణ పనులకు సహకారం అందించాలని రైతులకు ఆయన సూచించారు. వ్యాపారలు జక్కాని శ్రీనివాస్ సేట్, కాశీనాథ్, నాగరాజు, మల్లేశం, దర్జీ శ్రీధర్ తదితరులున్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తే పుట్టగతులు ఉండవు



బాన్సువాడ రూరల్: మాదిగలకు అన్యాయం చేసిన వారికి పుట్టగతులు ఉండవని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షులు సత్తిగారి లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె బాన్సువాడలో మాట్లాడారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతోందని, గత 30 ఏళ్లుగా మందకృష్ణమాదిగ పోరాటం చేస్తున్నారన్నారు. మాలమహానాడు నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి తలొగ్గి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్ 1నాటికి ఎస్సీవర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఈనెల 28న మందకృష్ణ మాదిగ కామారెడ్డి జిల్లా కేంద్రానికి వస్తున్నారని సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బాలరాజు, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్పీ నాయకులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంగన్‌వాడీలలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ తెలిపారు. శుక్రవారం కాస్లాబాద్‌లో ఇంటింటికి తిరుగుతూ నీలువ ఉన్న నీటిని తొలగిస్తూ డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఎండీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళ అయినందుకే ముప్పేట దాడి


ఎల్లయ్యకు కండువా కప్పుతున్న బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యప్రకాష్

కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బీసీ మహిళ అయినందుకే గతంలో బీఆర్‌ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ముప్పేట దాడి చేస్తున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజకీయ సినిమా రంగంలోని ఆధిపత్య కులాలు ఉద్దేశపూర్వకంగానే దాడి చేస్తున్నారని అన్నారు. బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలు ప్రజా సమస్యలను గాలికొదిలేశాయన్నారు. హైడ్రా, మూసీ చుట్టూ నేతలు తిరుగుతున్నారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగారపు ఎల్లయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి బీఎల్‌పీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, నాయకులు సాయికృష్ణ, సునిల్ తదితరులున్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం యువత రక్తదానం చేయాలని కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. ఈనెల 20న స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఐవీఎఫ్, రెడ్‌క్రాస్ సొసైటీ, కామారెడ్డి రక్తదాతల సమూహం సంయుక్తంగా నిర్వహించే రక్తదాన శిబిరం ప్రచార కరపత్రాలను చైర్‌పర్సన్ ఇందుప్రియ ఆవిష్కరించి మాట్లాడారు. తలసేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి, ప్రతినిధులు జమీల్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


అంజలితో ఉపాధ్యాయులు

దోమకొండ: నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలోని గీతా కాన్వెంట్ పాఠశాలలో ఈ నెల 17న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో దోమకొండలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని అంజలి ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు సంగీత, పీఈటీ ఉష తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే 43వ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మొండిసడక్-నర్సాపూర్ జీపీ పరిధిలో మీ-సేవా కేంద్రం ఏర్పాటుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ సతీష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి కంప్యూటర్ పరిజ్ఞానం గల 18-35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 21 వరకు తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐటీ పరిజ్ఞానం, రాత పరీక్ష ఆధారంగా నియామకం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలానికి శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రానున్నారు. మాల్తుమ్మెద సొసైటీ పరిధిలో గల గోపాల్‌పేటలో, తాండూర్ సొసైటీ పరిధిలో గల ధర్మారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించనున్నారు.

ఎల్లారెడ్డికి..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి నేడు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డిలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు.

కోతుల బెడదపై సమావేశం

భిక్కనూరు: సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో నేటి ఉదయం 10 గంటలకు కోతుల బెడదపై సమావేశం ఏర్పాటు చేసినట్లు వీడీసీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. కోతుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



బాన్సువాడ రూరల్: పాత బాన్సువాడకు చెందిన పోలీస్‌కానిస్టేబుల్ గులెపల్లి సురేశ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బీర్కూర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సురేశ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కానిస్టేబుల్ మృతికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు సంతాపం తెలిపారు.

మద్యం మత్తులో ఆస్పత్రిపై దాడి

కామారెడ్డి టౌన్: మద్యం మత్తులో ఆస్పత్రిపై దాడి చేసి వీరంగం సృష్టించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన ఓ వ్యక్తి కామారెడ్డిలో ఓ పత్రికలో విలేకరిగా కొనసాగుతున్నాడు. అతను మరో వ్యక్తితో కలిసి మద్యం మత్తులో జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సమన్విత ఆస్పత్రిపై శుక్రవారం దాడి చేశారు. వైద్యుడు ప్రవీణ్‌కుమార్‌ను డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఈ క్రమంలో వైద్యుడితో పాటు సిబ్బంది, ఇద్దరు ఆయాలపై దాడి చేసి, ఆస్పత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. వైద్యుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రీరిపబ్లిక్ దినోత్సవానికి వలంటీర్ల ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): వెస్ట్ జోన్ ముందస్తు రిపబ్లిక్ దినోత్సవం తెయూలో శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి హాజరై వలంటీర్లు క్రమశిక్షణతో దేశభక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్లు జాతీయ సమైక్యత లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీరామకృష్ణ హాజరై నిబంధనల ప్రకారం ఎత్తు, పరుగు పందెం, పరేడ్ చేయించి ఎంపిక చేపట్టారు. అనంతరం వలంటీర్ల విష పరిజ్ఞానంతోపాటు, గానం, నృత్యం భాషా నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని దారుగల్లీకి చెందిన షేక్‌మహబూబ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మహబూబ్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. అతని మానసికస్థితి సరిగా లేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లిలో తేలు నడిపి సాయిలు అనే వ్యక్తి తన భూసమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఉదయం గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ముగ్గురు అన్నదమ్ములకు చెందిన నాలుగు ఎకరాల భూమిలో తన పేరుమీద గుంట భూమి కూడా లేదని, తన అన్న ఒక్కడే రెండెకరాలు పట్టా చేసుకున్నాడని సాయిలు తెలిపాడు. అంతేకాకుండా తనపై దాడి చేశాడని పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు టవర్‌పై ఉన్న సాయిలుతో ఫోన్లో మాట్లాడి సముదాయించారు. గ్రామానికి చేరుకున్న ఎస్సై మనోజ్ కుమార్ హామీ మేరకు సాయిలు టవర్ దిగాడు. అనంతరం సాయిలుని ఎస్సై తహసీల్దార్ వెంకట్రావు వద్దకు తీసుకెళ్లి సమస్యపై మాట్లాడారు. సరైన ఆధారాలు ధ్రువపత్రాలు తీసుకొస్తే న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



తాడ్వాయి: అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాకేశ్(22) కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. రాకేశ్‌కు ఏడాది క్రితం వివాహమైంది. కాగా అతను రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 4న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడిని గాయపర్చిన నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని న్యూఎన్జీవో కాలనీలో వృద్ధుడిని కత్తితో గాయపర్చి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన చిందం సిద్ధిరాములు అనే వృద్ధుడి ఇంట్లోకి ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కత్తితో గాయపర్చి, అతని మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ని లాక్కొని ఆటోలో పారిపోయాడు. దీంతో వృద్ధుడు మనుమడు మనీష్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ జి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా ఆటో నంబర్ ఆధారంగా వివరాలను సేకరించారు. దొంగతనానికి సహకరించిన ఆటో డ్రైవర్ కరీంను పట్టుకుని విచారించగా కత్తితో గాయపర్చి, చైన్ దొంగలించిన నజీమ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దీంతో వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, ఆటో, కత్తి, రెండు తులాల బంగారు చైన్‌ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. దొంగతనం కేసును 24 గంటల్లో చేదించిన ఎస్సై మహేశ్‌తో పాటు సిబ్బందిని టౌన్ సీఐ జి శ్రీనివాసురాజు అభినందించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు

రెంజల్: మద్యం మత్తులో డయల్100కు కాల్ చేసి న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులకు శుక్రవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 50 చొప్పున జరిమానా విధించినట్లు రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని నీలా గ్రామానికి చెందిన గోసుల సాయినాథ్, మమ్మాయి శివకుమార్ తాగిన మత్తులో డయల్100కు కాల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. వారిని విచారించి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం మత్తులో డయల్100కు కాల్ చేస్తే శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.

చోరీ కేసులో మరో నిందితుడికి ఏడాది..

నందిపేట్: బైక్ చోరీకి పాల్పడిన ఘటనలో గోపాల వంశీ అనే నిందితుడికి ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి శుక్రవారం ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు నందిపేట ఎస్సై హరిబాబు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎరుకుడు గ్రామానికి చెందిన వంశీ నందిపేట పీఎస్‌లో గత ఏడాది బైక్‌ను చోరీ చేశాడు. అప్పటి ఎస్సై రాహుల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో శుక్రవారం ఏపీపీ రామకృష్ణ కేసుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. విచారణ అనంతరం నేరం రుజువు కాగా న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

మిట్టాపూర్ శివారులో దారి దోపిడీ

నవీపేట: మండలంలోని మిట్టాపూర్ శివారులో బాసర రహదారిపై గుర్తు తెలియని దుండగులు గురువారం ఉదయం దారి దోపిడీకి పాల్పడ్డారు. శివతండాకు చెందిన నరేశ్‌కుమార్ వేకువజామున నాలుగున్నర ప్రాంతంలో బాసర వైపు బైక్‌పై వెళ్తుండగా ముగ్గురు దుండగులు మిట్టాపూర్ వద్ద అటకాయించారు. బైక్‌ను ఆపి భౌతికదాడికి పాల్పడ్డారు. నరేశ్‌కుమార్ జేబులో ఉన్న రూ. 2500 నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

అర్గుల్‌లో చోరీ



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో శుక్రవారం మధ్యాహ్నం మగ్గిడి గంగాధర్ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అర్గుల్‌కు చెందిన మగ్గిడి గంగాధర్ పని నిమిత్తం ఆర్మూర్‌కు వెళ్లాడు. ఆర్మూర్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న భార్య పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూం అల్మారాలో ఉన్న రూ. 4లక్షల నగదు, బంగారు నెక్లెస్, బంగారు తీగ సుమారు 5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల వారిని అడిగితే ఓ గుర్తు తెలియని వ్యక్తి వారి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని తెలిపారు. ఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం వచ్చి నమూనాలు సేకరించారు.